క్లుప్తంగా

మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలి



చైర్మన్, వైస్ చైర్మన్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ లావణ్య

ములుగు(గజ్వేల్): వంటిమామిడి వ్యవసాయ మార్కెట్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు నూతన పాలకవర్గం కృషి చేయాలని ములుగు ఎంపీపీ పెద్దబాల్ లావణ్యఅంజన్‌గౌడ్ కోరారు. వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా నూతనంగా నియామకమైన జహంగీర్, భూపాల్‌రెడ్డిలను ఆదివారం ములుగులో ఎంపీపీ ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతుల అవసరాలకు అనుగుణంగా మార్కెట్ కమిటీ పనిచేసి వారి మన్ననలను పొందాలన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



సాయం అందిస్తున్న సుల్తాన ఉమర్

దుబ్బాకటౌన్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చేర్వాపూర్‌కు చెందిన నిరుపేద పిట్ల వెంకటయ్య కుటుంబానికి సామాజిక సేవకురాలు, దౌల్తాబాద్ మండలం ఇండస్ట్రియల్ అంగన్‌వాడీ టీచర్ సుల్తాన ఉమర్ అండగా నిలిచారు. ఆదివారం ఆ కుటుంబాన్ని పరామర్శించి నిత్యావసర సరుకులు, బియ్యం, నగదు అందించారు. కార్యక్రమంలో మూర్తి నరేశ్‌రెడ్డి, శ్రీనివాస్, నరేశ్, యాదగిరి, ఎల్లం ఉన్నారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్



శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి

కోహెడరూరల్(హుస్నాబాద్): యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా మండలంలోని వింజపల్లి గ్రామానికి చెందిన దూలం శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఆదివారం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, అలాగే తన నియామకానికి సహకరించిన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాకేశ్, చింతకింది శంకర్, శ్రీనివాస్ ఉన్నారు.

నియామకం

అక్కన్నపేట(హుస్నాబాద్): హుస్నాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో–ఆర్డినేటర్‌గా మంద పరశురాములు, అక్కన్నపేట మండల యూత్ అధ్యక్షుడిగా పాండ్రాల దాము, అసెంబ్లీ జనరల్ సెక్రటరీగా నకీర్తి మునిరాజులను నియమిస్తూ సిద్దిపేట జిల్లా మహిళా అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని సూచించారు. అదే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని పేర్కొన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో పదవీ బాధ్యతలను కట్టబెట్టినందుకు వారి నమ్మకానికి వమ్ము చేయకుండా పని చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సైనికుల్లా పనిచేస్తామని తెలిపారు.

యూత్ కమిటీ ఎన్నిక

హుస్నాబాద్: హుస్నాబాద్ మండల, పట్టణ యువజన కాంగ్రెస్ కమిటీని ఆదివారం యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షారెడ్డి నియమించారు. మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా పోషవేణి శ్రీశైలం, హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడిగా చెన్నవేని విద్యాసాగర్, యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శులుగా లావుద్యా జవహర్‌నాయక్, బందెల హరీశ్, అసెంబ్లీ జనరల్ సెక్రటరీగా ముడికె ప్రశాంత్, పోగుల కుమార్, బూరుగు సతీశ్‌లను నియమించారు.

జిల్లా యువజన కార్యదర్శిగా బండి హరీశ్

హుస్నాబాద్‌రూరల్: జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా వంగ రామయ్యపల్లికి చెందిన బండి హరీశ్‌ను జిల్లా అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి నియమించినట్లు ఆదివారం మండల అధ్యక్షుడు చందు తెలిపారు. పార్టీ నిర్మాణంలో ముందుండి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న యువకులకు పార్టీ తొలి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

కూల్చివేతలే.. నిర్మాణాలు ఏవి?

- చరిత్ర కలిగిన గ్రామ సచివాలయం నేలమట్టం
- గ్రామంలో లైబ్రరీ కూల్చివేత
- ఇష్టారాజ్యంగా లద్నూర్ గ్రామ పాలకవర్గం



కూల్చివేసిన గ్రంథాలయం



లద్నూర్ గ్రామ సచివాలయం (ఫైల్)

మద్దూరు(హుస్నాబాద్): ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే లద్నూర్ గ్రామ సచివాలయానికి ప్రత్యేక ముద్ర ఉండేది. ఉమ్మడి జిల్లాలో ఏ గ్రామంలో లేని విధంగా 1971లో గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని నిర్మించారు. నాడు జిల్లాలోనే ప్రత్యేకశైలిలో నిర్మించిన గ్రామ సచివాలయం అని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు సందర్శించి, తమ గ్రామాల్లో నిర్మించుకున్నారు. అంతటి విశిష్టత కలిగిన గ్రామ సచివాలయాన్ని గ్రామ పాలకవర్గం గ్రామసభ తీర్మానం లేకుండానే కూల్చివేసింది. గ్రామ సచివాలయం కూల్చి నెలలు గడుస్తున్నా నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో, గ్రామప్రజలు తమ సమస్యలపై పాలకులకు చెప్పాలంటే ఎక్కడి వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం గ్రామంలోని రైతు వేదికలో తాత్కలికంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. దీంతో గ్రామ అధికారులు, పాలకవర్గం పూర్తిగా ప్రజలకు అందుబాటులో లేకుండా పోయారు.

- లద్నూర్ గ్రామంలో ప్రతి ఇంట్లో ఉన్న యువత పోస్ట్ గ్రాడ్యూయేట్ చదివి ఉన్నారు. ఎక్కువ మంది యువత గ్రాడ్యుయెట్ పూర్తి చేసి ఉండటంతో 1995లో గ్రామ సచివాలయం ఆవరణలో లైబ్రరీని పంచాయతీ నిధులతో నిర్మించారు.
- మూడు సంవత్సరాల క్రితం యువతకు కంప్యూటర్ విద్యను అందించాలని లైబ్రరీలో కంప్యూర్‌లను అందుబాటులో ఉంచారు. ఇంతలోనే ఎలాంటి కారణం లేకుండానే గ్రామ సచివాలయం నూతన నిర్మాణం పేరుతో సచివాలయంతో పాటుగా లైబ్రరీని కూల్చడంతో నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- ప్రస్తుతం ప్రభుత్వం ఉద్యోగాల నోటిఫికేషన్‌లు జారీ అవ్వడంతో చదువుకుందామంటే లైబ్రరీ అందుబాటులో లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- గ్రామానికే తలామానికంగా ఉన్న ఎన్నో సంవత్సరాల వయస్సు కలిగిన చింతచెట్లు, ఇతర చెట్లను అభివృద్ధి పేరుతో గ్రామ పాలకవర్గం వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తూ చెట్లను ఇష్టారాజ్యంగా నరికివేస్తున్నారు.
- రాష్ట్ర ప్రభుత్వం హరితహారం పేరుతో చెట్లను నాటుతుంటే లద్నూర్ గ్రామంలో మాత్రం చెట్లను నరకడంపై గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.
- కొన్ని సంవత్సరాలుగా గ్రామ పంచాయితీ ఆధీనంలో ఉన్న రక్షిత తాగునీటి ప్లాంట్, ప్రస్తుతం ప్రైవేట్ వ్యక్తుల చేతిల్లోకి మారింది.
- గతంలో ఈ వాటర్ ప్లాంట్ ద్వారా గ్రామ పంచాయతీకి సంవత్సరానికి రూ.40 వేల ఆదాయం వచ్చేది. గ్రామస్తుల వద్ద నుంచి చందలు వసూలు చేసి గ్రామ సచివాలయంలో నూతన ప్లాంట్ నిర్మించి దానిని కొంతమంది ప్రైవేట్ వ్యక్తులకు నిర్వహణకు అప్పగించడంతో దాని ద్వారా వచ్చే ఆదాయానికి గండి పడింది.
- ప్రైవేట్ వ్యక్తుల ద్వారా ఈ వాటర్ ప్లాంట్ డబ్బులు తీసుకుంటూ, పాలకులు తమ సొంత అవసరాలకు వాడుకొని పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు.
- గ్రామ పంచాయతీలో ఇంత అవకతవకలు జరుగుతున్నా అధికారులు చోద్యం చూడటంపై గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- ఇప్పటికైనా గ్రామంలో జరుగుతున్న అవకతవకలపై అధికారులు ఆడిటింగ్ నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అన్ని అవకతవకలే..



గ్రామంలో అభివృద్ధికి బదులుగా అన్ని అవకతవకలే జరుగుతున్నాయి. నేడు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉద్యోగ నోటిఫికేషన్‌లకు నిరుద్యోగులు ప్రిపేర్ అవుదామనుకుంటే గ్రామంలోని లైబ్రరీని అకారణంగా కూల్చివేశారు. అదేవిధంగా గ్రామ సచివాలయాన్ని తమ ఇష్టారాజ్యంగా కూల్చివేశారు. గ్రామంలో ఎన్నో సంవత్సరాల నుంచి ఉన్న చెట్లను కొట్టివేస్తున్నారు. గ్రామ పంచాయతీకి వచ్చే ఆదాయంలో అన్ని అవకతవకలు జరుగుతున్నాయి. అధికారులు గ్రామసభను నిర్వహించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలి.

–జీడికంటి సుదర్శన్, మాజీ సర్పంచ్, లద్నూర్

త్వరలోనే నిర్మాణం చేపడతాం

గ్రామ పంచాయతీ నిర్మాణానికి రూ.20లక్షల నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే నిర్మాణం చేపడతాం.

–శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, లద్నూర్

యువత క్రీడల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మేక సంతోష్‌కుమార్

మద్దూరు(హుస్నాబాద్): యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బీఆర్ఎస్ పార్టీ మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్ అన్నారు. ఈ నెల 5న గాగ్గిళ్లాపూర్ గ్రామంలో నిర్వహించిన డివిజన్ స్థాయి క్రీడాపోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సర్పంచ్ బోల్లు కృష్ణవేణి చంద్రమౌళితో కలిసి విజేతకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడాకారులకు చక్కటి ప్రోత్సాహం లభిస్తుందన్నారు. క్రీడారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలతో క్రీడాకారులు రాణించాలన్నారు. యువత చదువుతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకోవాలన్నారు. ప్రథమ బహుమతి పొందిన మద్దూరు టీమ్‌కు రూ.10వేలు, ద్వితీయ బహుమతి పొందిన గాగ్గిళ్లాపూర్ టీమ్‌కు రూ.6వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మేక మాధవిగోపాల్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఏలూరి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

‘టీచర్లకు విద్యాశాఖ డైరెక్టర్ క్షమాపణ చెప్పాలి’

హుస్నాబాద్: టీచర్లను అవమానించిన రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన వెంటనే టీచర్లకు క్షమాపణ చెప్పాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశాడు. 13 జిల్లాల స్పౌజ్ బాధిత ఉపాధ్యాయులు శనివారం హైదరాబాద్‌లో తలపెట్టిన నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులపై అనుచిత వ్యాఖ్యలు, బెదిరింపులకు పాల్పడిన దేవసేన గౌరవ ప్రదమైన హోదాలో ఉండి ఇలా మాట్లాడటం సరైంది కాదన్నారు. టీచర్లకు విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన వెంటనే క్షమాపణ చెప్పి తమ సంస్కారాన్ని నిరూపించుకోవాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని అమలు చేసి బదిలీలు, పదోన్నతులను నిర్వహించాలని మల్లేశ్ డిమాండ్ చేశాడు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

హుస్నాబాద్: వీ–నెట్ ఫౌండేషన్ ఎర్రం రఘునందన్‌రెడ్డి(యూఎస్ఏ) ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్యవైశ్య భవన్‌లో ఆదివారం సంక్రాంతి ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. హుస్నాబాద్ పట్టణానికి చెందిన ఎర్రం రఘునందన్‌రెడ్డి ఆమెరికాలో స్థిరపడి సొంత డబ్బులతో యూఎస్ఏలో వీ–నెట్ ఫౌండేషన్‌ను స్థాపించి అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు. పుట్టిన ఊరుపై ఉన్న మమకారంతో అదే ఫౌండేషన్ ద్వారా హుస్నాబాద్ పట్టణంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించుకున్నాడు. కరోనా సమయంలో కూడా హమాలీ, పారిశుధ్య కార్మికులకు భోజనం ఏర్పాటు చేశాడు. ఇందులో భాగంగా హుస్నాబాద్ పట్టణంలో తన పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో జనవరి 15 సంక్రాంతి రోజు ముగ్గుల పోటీలు నిర్వహించారు. 22 మంది జడ్జీలతో పట్టణంలోని ప్రతీ ఇంటికి వెళ్లి వాకిళ్లలో మహిళలు వేసిన ముగ్గులు సేకరించి, మంచి ముగ్గులు వేసిన వారిని గుర్తించి విజేతలుగా ప్రకటించారు. ఈ రోజు దాదాపు 100 మంది విజేతలకు ట్రోఫీలు, గిఫ్టులను అందజేశారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలకు జడ్జీలుగా వ్యవహరించిన వారిని సన్మానించారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ కో–ఆర్డినేటర్ గంగిశెట్టి గాంధీ, స్టేజి కో–ఆర్డినేటర్ గంగం రజిత, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ సందర్శన



హనుమాన్ ఆలయాన్ని సందర్శిస్తున్న టీటీడీ ఉద్యోగి, తదితరులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్‌లో గల పురాతన హనుమాన్ ఆలయాన్ని ఆదివారం తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) ఉద్యోగి డా.రామనాథం పరిశీలించారు. గతంలో ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రి హరీశ్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మను గ్రామస్తులు కోరడంతో టీటీడీ ఉద్యోగి ఆలయాన్ని సందర్శించారు. గుడి, గుడి ఆవరణలో భజనమండలి కోసం గది నిర్మాణం పరిశీలించారు. వారి వెంట సర్పంచ్ చంద్రకళరవి, ఎంపీటీసీ దుర్గారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

దుబ్బాక: సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం లాంటిదని కౌన్సిలర్ గోనేపల్లి దేవలక్ష్మి అన్నారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ వార్డుకు చెందిన మట్టం సంగమేశ్వర్ ఇటీవల అనారోగ్యానికి గురికాగా సీఎంఆర్ఎఫ్ పథకం కింద ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి చొరవతో మంజూరైన రూ.30వేల చెక్కును ఆదివారం బాధితుడికి అందించారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రెడ్డి, దేవయ్య, లింగం, తదితరులున్నారు.

సన్మానం

దుబ్బాకటౌన్: దుబ్బాక పట్టణ పద్మశాలి సమాజం అధ్యక్షుడిగా ఎన్నికైన గాజుల తిరుపతిని ఆదివారం రాజ్యసభ సభ్యుడు బడుగు లింగయ్య యాదవ్ సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మద్దుల నాగేశ్వర్‌రెడ్డి, బాలాజీ ఆలయ చైర్మన్ వడ్లకొండ శ్రీధర్, నాయకులు చింత రాజు, ఆకుల దేవేందర్, నల్ల శ్రీనివాస్, కూర వేణు, అంకం మధు, మహేష్ తదితరులు ఉన్నారు.

కేలండర్ ఆవిష్కరణకు తరలిరావాలి

కోహెడ(హుస్నాబాద్): పంచాయతీ కారోబార్, బిల్ కలెక్టర్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జనవరి 2023 కేలండర్ ఆవిష్కరణకు తరలిరావాలని కారోబార్ జిల్లా సంఘం అధ్యక్షుడు మెట్టు వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో నిర్వహించే కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి మంత్రులు హరీశ్‌రావు, దయాకర్‌రావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్, సంపత్, మల్లేశం, రాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ నాయకుల అరెస్ట్ అక్రమం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్న ఉపాధ్యాయ నాయకులను అరెస్ట్ చేయడం అక్రమం అని పీఆర్టీయూ జిల్లా నాయకులు అన్నారు. ఆదివారం సిద్దిపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, అధ్యక్షుడు శశిధర్‌శర్మ, ప్రధాన కార్యదర్శి వెంటకరాజంలు మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం 5గంటలకు గజ్వేల్ పట్టణంలోని పీఆర్టీయూ నాయకులను పోలీస్‌లు అరెస్ట్ చేశారని ఇది సరైంది కాదన్నారు. 50 సంవత్సరాలుగా ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం పోరాడుతుందన్నారు.

నాచగిరి గర్భగుడి ద్వారానికి ఇత్తడి తొడుగు



ఇత్తడి తొడుగులతో మెరిసిపోతున్న గర్భగుడి ద్వారం

వర్గల్(గజ్వేల్): నాచగిరి ఆలయ గర్బగుడి ద్వారానికి హైదరాబాద్‌కు చెందిన నర్సింలు అనే దాత ఇత్తడి తొడుగులను సమకూర్చాడు. వాటిని ఆదివారం ద్వారానికి బిగించారు. దీంతో ఇత్తడి, పుత్తడి కాంతులతో ద్వారం తణుకులీనుతున్నది.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి నర్సాపూర్ చౌరస్తా వరకు విద్యుత్ లైన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం పటేల్‌పూర, అంబేడ్కర్‌నగర్, సంజీవయ్యనగర్, సాజీద్‌పూర, శంకర్‌నగర్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, బయగల్లి, పరిసర ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ (ఆపరేషన్) పండరీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

ఉన్నత విద్యా కుసుమం అంబేడ్కర్

మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే రసమయి

బెజ్జంకి(సిద్దిపేట): అక్షరమే ఆయుధంగా ఉన్నత శిఖరాలను అధిరోహించిన విద్యా కుసుమం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. మండలంలోని గూడెం గ్రామంలో నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసమానతలు, అంటరానితనం నిర్మూలనకు అహర్నిశలు పోరాడిన గొప్ప సంస్కర్తగా ఆయన అభివర్ణించారు. రాజ్యాంగం ద్వారా ముందు తరాలకు భవిష్యత్ ఇచ్చాడని తెలిపారు. సీఎం కేసీఆర్ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తూ అంబేడ్కర్ ఆశయాలను నెరవేరుస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమీషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్, ఆరెపల్లె మోహన్, ఎంపీపీ లింగాల నిర్మల, జెడ్పీటీసీ కనగండ్ల కవిత, ఏఎంసీ చైర్మన్ రాజయ్య, సర్పంచ్ రాజశ్రీ, వైస్ ఎంపీపీ సబిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోఆప్షన్ సభ్యులు మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, సంఘం నాయకులు బొనగిరి శ్రీనివాస్, బాలయ్య, రాజు, పోచమల్లు, పరశురాములు, సంపత్, శేఖర్‌బాబు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డును ఆదర్శంగా నిలపాలి

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు

హుస్నాబాద్: రైతులకు సేవచేసే అదృష్ట భాగ్యం కల్పించినందుకు హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గ సభ్యులు, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగా నియమింపబడిన పాలకవర్గ సభ్యులు ఆదివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ చరిత్రలో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను మహిళలకే కేటాయించడం ఇదే మొదటి సారి. జిల్లాలోనే హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డును ఆదర్శంగా నిలిపేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే అన్నారు. రైతులకు సేవచేసే అవకాశం రావడాన్ని అదృష్టంగా భావించాలన్నారు. పాలకవర్గ సభ్యులు సమన్వయంతో మార్కెట్ యార్డును మరింత అభివృద్ధిలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సూచిస్తూ పాలకవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజనితిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ రామోజు రజితకృష్ణమాచారి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



స్వామివారికి జలధివాసం చేస్తున్న గ్రామస్తులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని చాపగానీతండా గ్రామంలో పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహానికి ఆదివారం భక్తిశ్రద్ధలతో జలధివాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు గ్రామంలో నూతనంగా నిర్మించిన పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భానోతు లక్ష్మీవీరన్న మాట్లాడుతూ.. గ్రామస్తుల సహాయ, సహకారాలతో ఆంజనేయస్వామి ఆలయం నిర్మించుకున్నామన్నారు. ఆలయం పూర్తిస్థాయిలో నిర్మాణానికి ఇంకా నిధులు కావాల్సి ఉందన్నారు. ఎవరైనా దాతలు ఉంటే ముందుకు రావాలన్నారు. అదేవిధంగా నేడు సోమవారం పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుగులోతు రవినాయక్, ఉపాధ్యాయుడు రంగానాయక్, నాయకులు భూక్య తిరుపతినాయక్, భానోతు వీరన్ననాయక్, రాజేందర్‌నాయక్, పంచాయతీ పాలకవర్గం, యువకులు పాల్గొన్నారు.

కూడవెల్లిలో భక్తుల కిటకిట

దుబ్బాకరూరల్: మాఘ అమావాస్య జాతర సందర్భంగా భూంపల్లి మండలంలోని కూడవెల్లి రామలింగేశ్వరస్వామి ఉత్సవాలు ఆదివారం నాటికి రెండో రోజుకు చేరుకున్నాయి. రామలింగేశ్వరస్వామిని దర్శించుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆవరణ కిక్కిరిసిపోయింది. ఆదివారం సెలవు కావడంతో సరిహద్దు జిల్లాల ప్రజలు తరలివచ్చారు. నీటి గుండంలో భక్తులు స్నానమాచరించారు. జాతరలో బ్రేక్ డాన్స్, చిన్నారులు ట్రైన్‌లో తిరుగుతూ కేరింతలు కొట్టారు. సిద్దిపేట రూరల్ సీఐ జానకీరామ్ రెడ్డి, ఎస్ఐ మహేందర్‌లు జాతరలో పార్కింగ్ ప్రదేశాలు, దర్శన ప్రాంతాలను పరిశీలించారు. కంట్రోల్ రూంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. సిబ్బందిని ఎప్పటికప్పుడూ అలర్ట్ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో భూంపల్లి–అక్బర్‌పేట చౌరస్తా వద్ద వాహనాలు ఒక్కసారిగా అడ్డురావడంతో ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సిద్దిపేట–రామాయంపేట రహదారిపై వాహనాలు ఐదు కిలోమీటర్ల వరకు చిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీస్‌లు వాహనాలను దగ్గరుండి పంపిస్తున్నారు.



జాతరలో కిక్కిరిసిన జనం

ఘనంగా నృసింహస్వామి ఆలయ వార్షికోత్సవాలు



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని మర్రిముచ్చాల సాంద్రనంద ఆశ్రమంలో ఆదివారం ఆశ్రమ నిర్వాహకుడు శ్రీనాథశర్మ ఆధ్వర్యంలో నృసింహస్వామి వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, విఘ్నేశ్వరపూజ, స్వస్తివచనం, పంచగవ్య మేళనం, ఉదయం 9 గంటలకు రుత్విగ్వరణం, ప్రాశనం, అఖండ దీపారాధన, కలశస్థాపన, నవగ్రహ వాస్తుయోగిని, సర్వతోభద్ర క్షత్రపాల మండపారాధన, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, శ్రీగణపతిహవనం, మహారుద్రాహవనం, విశేషపూజ అలంకారాలు, హారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు.

బండపై భక్తుల సందడి



గుండంలో స్నానాలు చేస్తున్న భక్తులు



స్వామివారి శావ ఊరేగింపు

సిద్దిపేటరూరల్: స్వయంభూ లక్ష్మీనర్సింహాస్వామి పుల్లూరు బండ ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు బండంతా భక్త జనసందోహంతో కిటకిటలాడిపోయింది. ఆదివారం లక్ష్మీనర్సింహాస్వామికి ఉదయం సుప్రభాతం, విశేషఅర్చన, సుదర్శన నారసింహ హోమం, విష్ణుసహస్రనామస్తోత్ర పారాయణం, సర్వదేవతా మూలమంత్ర హవనములు, పూర్ణాహుతి, తీర్థగోష్ఠి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామివారి శావ ఊరేగింపు బండపై భక్తులకు కనువిందు చేసింది. సర్పంచ్ నరేశ్, ఆలయ కమిటీ చైర్మన్ డైరెక్టర్లు, వైదిక అర్చకులు, నిర్వాహకులు జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. స్వామివారిని రాష్ట్ర రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ పాపారావు, జెడ్పీ చైర్‌పర్సన్ రోజారాధాకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు మోహన్ లాల్, లక్ష్మిరాజం, పలువురు నాయకులు, భక్తులు దర్శించుకున్నారు.